ప్రజాశక్తి
గురువారం 26 జూన్ 2025 5 అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

సింగయ్య కేసులో జగన్‌రెడ్డిని శిక్షించాల్సిందే

◆పెట్టుబడులను అడ్డుకునేలా కుట్రలు

◆రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సింగయ్య మృతి కేసులో కారు డ్రైవర్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని శిక్షించాల్సిందే అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం నాడు టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డితో కలిసి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవత్వపు విలువలేని క్రూరుడిగా జగన్ మారాడన్నారు. సింగయ్య మృతి ఘటనతో ఇది మరోసారి రుజువు అయ్యిందన్నారు. తన సమక్షంలో వైసిపి కార్యకర్త సింగయ్య కారు కింద పడి ప్రానాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే కారులో ఆసుపత్రికి తరలించాల్సింది పోయి చెత్తను విసిరేసినట్లు అతన్ని విసిరేసి వెళ్లిపోవడం మానవత్వాన్ని మంటగలిపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీ షీటర్లు, నేరస్థులకు మద్దతుగా పొదిలిలో పరామర్శ పేరుతో వైకాపా కార్యకర్తలను వెంటేసుకుపోయి గొడవలు సృష్టించి పోలీసులను విమర్శిస్తారాని ప్రశ్నించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవటానికి జగన్ ఏడాదిగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. అలాంటి కుట్ర, కుతంత్రాలు ఎన్ని చేసిన కూటమి పాలనలో సాగవన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేతలు ఆలం నరసానాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికి జగన్ చేసిన హత్యే : దగ్గుపాటి

పల్నాడు జిల్లాలో జరిగిన సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యేనని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఉనికి కోసం బల ప్రదర్శనలు చేస్తూ రాష్ట్రంలో సొంత పార్టీ కార్యకర్తలను కూడా జగన్ బలి తీసుకుంటున్నారన్నారు. అనుమతులు లేకుండా వేలమందితో ర్యాలీ చేశారని దాని ఫలితంగానే జగన్ వాహనం కింద సింగయ్య పడి మృత్యువాత పడ్డారన్నారు. సింగయ్య మతిని జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

ఎమర్జెన్సీని తలపించేలా మతోన్మాద పాలన

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న పి.మధు

మాట్లాడుతున్న వి.రాంభూపాల్

◆ప్రశ్నించే వారిపై దాడులు, అక్రమ కేసులు

◆దేశ సమైక్యతను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలిక

◆ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో మతోన్మాద పాలనపై పోరాటానికి సిద్ధం

◆సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలో ఏమర్జెన్సీని తలపించేలా ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో మతోన్మాద పాలన సాగుతోందని సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ పి.మధు విమర్శించారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో బుధవారం ఉదయం సిపిఎం అనంతపురం నగర కమిటీ ఆధ్వర్యంలో 'ఎమర్జెన్సీ నాడు- నేడు' అన్న అంశంపై ర్యాలీ, సభను నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి టవర్‌క్లాక్ సమీపాన ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్‌క్లాక్ వద్ద సభను నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో మధుతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం జూన్ 25న దేశంలో ఎమర్జన్సీ ప్రకటించిందన్నారు. అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు 1.13 లక్షల మందిని ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. ఇందులో కార్మిక యూనియన్ల నాయకులు, విద్యార్థి నాయకులే ఎక్కువగా ఉన్నారన్నారు. 18 లక్షల మంది కార్మికుల మీద తీవ్ర నిర్బంధం సాగిందని తెలియజేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీలో మార్క్సిస్టుల మీద పగబట్టి వ్యవహరించిందన్నారు. వాస్తవంగా నాడు కార్మికులు, విద్యార్థులు, వామపక్ష వాదులే ప్రధాన ప్రతిఘటనదారులన్నారు. 50 ఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటి పాలన గుర్తు చేసుకుంటే, అంతకంటే మరింత ప్రమాదకరమైన పరిస్థితులు ప్రస్తుతం అమలవుతున్నాయన్నారు. కార్పొరేట్ మతోన్మాద నయా ప్యాసిస్ట్ పాలనలో ప్రజలు నిర్బందాన్ని చవిచూడవల్సి వస్తోందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా యుఎపిఎ చట్టం కింద ఎలాంటి విచారణ లేకుండా పదేళ్ల జైలు నిర్బంధాన్ని అనుభవించారన్నారు. బ్రిటీష్ కాలం కంటే ఘోరంగా నేటి దేశ పాలకులు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. అందరిపైనా కేసులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతూ పాలన

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

దేశంలోని మోడీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చీలిక తెచ్చేలా పాలన సాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే బిజెపి పాలనలో పదేళ్ల ఎలాంటి విచారణ లేకుండా నిర్బంధించే పరిస్థితి ఉందన్నారు. 370 అధికరణం రద్దు తర్వాత జమ్ము కాశ్మీర్, లడక్ లాంటి ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం మగ్యం అయ్యిందన్నారు. మత విద్వేషాన్ని రెచ్చగొట్టి దేశ సమెక్యత మీద విశ్వాసాన్ని దెబ్బతీసేలా మోడీ పాలన సాగుతోందన్నారు. గోసంరక్షణ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ మూకదాడులు పేట్రేగి పోతున్నాయని తెలిపారు. దేశంలో ఇదివరకు ఎన్నడూ లేని స్థాయిలో అస్తిత్వ రాజకీయాల ప్రాతిపదికన పరమత ద్వేషాన్ని రెచ్చగొట్టడం, సాటి పౌరుల్ని పరాయివారుగా పాలకులే చిత్రించడం అత్యంత విచారకరం అన్నారు. ఉగ్రవాద చర్యలను అరికట్టి, శిక్షించే అంశాన్ని వదిలిపెట్టి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పరమత సహనం కోరే వారిని మన దేశం నుంచి పాకిస్తాన్ పంపాలని చెప్పే స్థాయికి పాలన వచ్చిందన్నారు.

కార్పొరేట్ పాలన

సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

బిజెపి, నరేంద్ర మోడీ కార్పొరేట్ల జపం చేస్తూ వారి కోసమే పాలన సాగిస్తున్నారని సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులు విమర్శించారు. 1926 బ్రిటీషు కాలంలో పోరాడి సాధించుకున్న సమ్మె హక్కు చట్టాన్ని లేబర్ కోడ్‌ల పేరుతో అత్యంత నిరంకుశంగా రద్దు చేసిందన్నారు. సంఘం పెట్టుకోవడం, యజమానితో బేరసారాలు ఆడటం, ఆఖరికి సమ్మెకు సిద్ధం కావటం అన్నింటినీ కాలరాస్తోందన్నారు. ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పాలనలో మనువాద బావజాలం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

మత విధానాలతో మోడీ ప్రభుత్వం భారతదేశం అన్న భావననే విషపూరితం చేసి, ప్రజల్లో హిందూత్వను జొప్పిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. దళితులు, గిరిజనులు మనువాద భావజాలం కింద నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద బిజెపి దుష్టపాలనను తిప్పికొట్టడమే 50 యేళ్ల ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం మనకిచ్చే స్ఫూర్తి అన్నారు. పేదల సమస్యలు తీరెంత వరకు ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి రామిరెడ్డి, కమిటీ సభ్యులు వై.వెంకట నారాయణ, ప్రకాష్ రెడ్డి, గోపాల్, ఇర్ఫాన్, వలీ నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, లక్ష్మీనారాయణ, లక్ష్మీ నరసమ్మ, రామాంజనమ్మ, రాజు, బాలకష్ణ, జీవ, ఏటీఎం నాగరాజు, తిరుమలేశు, వరలక్ష్మి, అజాం, ఆది, రామంజి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

సమావేశంలో మాట్లాడుతున్న టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఛైర్మన్ టిసి.వరుణ్, వైస్ ఛైర్మన్ శివనారాయణశర్మ ఆదేశించారు. నగరంలోని అహుడా కార్యాలయంలో బుధవారం అథారిటీ సమావేశం నిర్వహించగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ ఓఎస్‌డి, టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్, ఆర్అండ్‌బి ఎస్ఇ, జిల్లా పర్యాటక శాఖ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి లోతైన చర్చ జరిగింది. ఆయా శాఖల పరిధిలో అహుడాకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అహుడా చేపట్టబోతున్న పబ్లిక్ పింక్ టాయిలెట్స్, అధునాతన స్విమ్మింగ్ పూల్స్, కందుకూరు టెండర్ల స్టేటస్, గుత్తి, మడకశిర ఎంఐజి టెండర్ల స్టేటస్‌పై వారు అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలకు సంబంధించిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని అహుడా సిబ్బందిని ఆదేశించారు.

మోసపుచ్చలేదు.. మేమే మోసపోయాం..!

◆చట్టప్రకారం అంతా చెల్లించాం

◆బాబు ఇ-స్టాంపులు టాంపర్ చేశారు..

◆ఎస్ఆర్‌సి ఎమ్‌డి అమిలినేని యశ్వంత్

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఆర్‌సి ఎమ్‌డి అమిలినేని యశ్వంత్

ప్రజాశక్తి-అనంతపురం

'ఈ స్టాంప్‌ల వ్యవహారంలో తాము ఎవరినీ మోసపుచ్చలేదు... తామే మోసోయి ప్రథమ బాధితులుగా ఉన్నాం.' అంటూ ఎస్ఆర్‌సి మేనేజింగ్ డైరెక్టర్ అమిలినేని యశ్వంత్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ చార్టెడ్ అకౌంటెంట్ బాలాజీ, జనరల్ మేనేజర్ సతీష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలాజీ ఇ-స్టాంపులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎస్ఆర్‌సి సంస్థ పెద్దఎత్తున పనులు చేపడుతున్న నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో ఇ-స్టాంపులను నిరంతరాయంగా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గంలోనూ 463 ఇ-స్టాంపులను యర్రప్ప భార్య వెండర్‌గా ఉన్న కట్టా భార్గవి నుంచి కొనుగోలు చేసినట్టు వివరించారు. వీటి విలువ రూ.23 లక్షలని చెప్పారు. ఇందులో చాలా సరిగానే చెల్లించారన్నారు. 19 ఇ-స్టాంపులను ట్యాంపరింగ్ చేసి తాము కట్టిన మొత్తం కంటే తక్కువ కట్టి మార్ఫింగ్ చేసి తమకు అందజేయడం జరిగిందని వివరించారు. దీని విలువ రూ.22 లక్షలు ఉందని చెప్పారు. వీటి ఇటీవల తాము పరిశీలించిన సమయంలో విషయం బయటకు వచ్చిందన్నారు. దీనిపై తాము అనంతపురం నగరంలోని టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసామని తెలిపారు. మీడియాలో వస్తున్న విధంగా రూ.900 కోట్లు అన్నది బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం కాదని అన్నారు. అది తమ సంస్థ హైపోథికేషన్ వాల్యు అని చెప్పారు. దీనికి 0.5 శాతం స్టాంపు డ్యూటీ ఉందని తెలిపారు. ఇది గరిష్ట పరిమితి రెండు లక్షల రూపాయలు మాత్రమేనని అన్నారు. ఆ రెండు లక్షల రూపాయలు తాము చెల్లించామని వివరించారు. బయట మాత్రం మొత్తం విలువపై లెక్కించి రూ.4.50 కోట్లుగా చూపిస్తున్నారన్నారు. ఇది సరైంది కాదని అన్నారు. దీనిపై వివరణివ్వడానికే మీడియా సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ తాము ఎవరినీ మోసం చేయలేదని అన్నారు. చట్టబద్ధంగా తమ సంస్థ గడిచిన 20 ఏళ్లుగా నడుస్తోందన్నారు. సుమారు 20 వేల మంది తమ సంస్థలో పనిచేస్తున్నారని తెలిపారు. వెండర్ ఇ-స్టాంపులో చేసిన మోసం ద్వారా మోసపోయామని గ్రహించి తామే ఫిర్యాదు చేసామన్నారు. తాము ప్రథమ బాధితులుగా ఉన్నామని పేర్కొన్నారు. దీన్ని కొంత మంది వక్రీకరించి లేనిపోని ఆరోపణలు చేసి తమ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తున్నారన్నారు. అటువంటి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బతికుండగానే చంపేశారు..!

◆స్థలం కోసం నకిలీ రిజిస్ట్రేషన్

◆తాడిపత్రిలో వృద్ధురాలి ఫిర్యాదు

◆వెలుగు చూసిన నకిలీ వ్యవహారం

◆సమగ్ర విచారణ చేస్తే మరిన్ని నకిలీలు బయటపడే అవకాశం.!

తన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెబుతున్న వృద్ధురాలు లక్ష్మిదేవి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఐదు సెంట్ల స్థలాన్ని కాజేసేందుకు బతికున్న వృద్ధురాలిని రికార్డుల పరంగా చంపేశారు. తమను ఎవరుడుగుతారులే అన్న దీమాతో అన్ని చోట్లా తప్పుడు పత్రాలు సృష్టించి ఏకంగా స్థలాన్ని వారిపై రాయించుకున్నారు. బాధిత వృద్ధురాలు స్థలంపై వాకబు చేయడంతో ఈ నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం గట్టురట్టు అయ్యింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్లో నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై కేసు నమోదు అయ్యింది. తాడిపత్రిలో వెలుగు చూసిన ఈ నకిలీ బాగోతానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

తాడిపత్రి సమీపంలోని నందలపాడులో నివాసం ఉంటున్న వృద్ధురాలు నక్కలోళ్ల లక్ష్మీదేవికి ఐదు సెంట్ల భూమి ఉంది. ఈ భూమి తనను పోషిస్తున్న వారికి తనతర్వాత చెందేలా వీలునామా రాశారు. వృద్ధురాలి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న కొందరు మోసగాళ్లు ఆమె మరణించిందని, ఆ వృద్ధురాలు తమ కుటుంబ సభ్యురాలని తప్పుడు పత్రాలు చూపించి ఆ స్థలాన్ని మరొకరికి విక్రయించారు. దీనికి సంబంధించి కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. తాడిపత్రిలో రిజిస్ట్రేషన్ చేయిస్తే ఈ వ్యవహారం బయట పడుతుందని భావించి అనంతపురం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ తతంగాన్ని నడిపారు. అయితే ఇటీవల ఈ స్థలంపై ప్రయివేటు కంపెనీలో రుణం పొందేందుకు వృద్ధురాలు ప్రయత్నించగా తన స్థలం ఇతరులపై రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిసింది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులను కలిశారు. తాను బతికుండగానే చనిపోయినట్లు ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ సబ్‌రిజిస్ట్రార్ రమణారావును నిలదీశారు. సమస్య పెద్దది కావడంతో దీనిని సరిదిద్దేందుకు సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ పత్రాలను రద్దు చేస్తామని ఆమెకు తెలిపారు. అయితే ఎన్ని రోజులు గడిచినా నకిలీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయలేదు. దీంతో బాధిత వృద్ధురాలు జిల్లా గ్రీవెన్స్‌కు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై మండల రెవెన్యూ అధికారులు విచారణ చేసినా సమస్యను పరిష్కరించలేకపోయారు. చేసేదేమీ లేక వృద్ధురాలు ఎఎస్పీ రోహిత్ కుమార్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. వెంటనే నకిలీ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు చేయాలంటూ తాడిపత్రి పట్టణ పోలీసులను ఎఎస్పీ ఆదేశించారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు 318(4), 340(2), 61(2) సెక్షన్ల కింద నకిలీ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన, సహకరించిన రిజిస్ట్రేషన్ అధికారిపై కేసులు నమోదు అయ్యాయి.

వృద్ధురాలు ఫిర్యాదుతో వెలుగు చూసిన నకిలీ వ్యవహారం

వృద్ధురాలు లక్ష్మీదేవి తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం వెలుగు చూసింది. ఈ అంశం ప్రస్తుతం తాడిపత్రి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. బతికున్న వారు మరణించినట్లు రికార్డులు సృష్టించి స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకోవడం ఏమిటంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ రిజిస్ట్రేషన్ చేయడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా నకిలీ రిజిస్ట్రేషన్ల డొంక కదలనుందా.?

తాడిపత్రిలో వృద్ధురాలు లక్ష్మీదేవి ఫిర్యాదుతో వెలుగు చూసిన నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశం అయ్యింది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి నకిలీ రిజిస్ట్రేషన్లు చాలానే జరిగాయన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. పోలీసులు, సంబంధిత ఉన్నతాధికారులు వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తే నకిలీ రిజిస్ట్రేషన్ల డొంక కదిలే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వృద్ధురాలు పేర్కొన్న ఫిర్యాదులో సబ్‌రిజిస్టార్, మధ్యవర్తులు, సాక్షులుగా వ్యవహరించిన వారంతా గ్రూపుగా ఏర్పడి ఇలాంటి స్థలాలను కాజేసి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు తెలుస్తోంది. నకిలీ రిజిస్ట్రేషన్లపై లోతుగా విచారణ చేసి ఇలాంటి పనులకు పాల్పడుతున్న వారిని కఠిన శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ మమతాదేవి

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని రంగాపురం, కేసేపల్లి చెత్త సంపద కేంద్రాలను బుధవారం ఎంపీడీవో మమతాదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ రెండు కేంద్రాలకు సరైన దారి సౌకర్యం లేకపోవడంతో వినియోగంలో లేవని, దారి సౌకర్యం కల్పించాలని తహశీల్దార్‌ను కోరామన్నారు. దారి సౌకర్యం ఏర్పాటు కాగానే ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, లక్ష్మీదేవి ఉన్నారు.

నేటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-గుత్తి

గ్రామపంచాయతీల అభివృద్ధిపై పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా సర్పంచులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే డివిజన్ స్థాయి శిక్షణకు మహిళా సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించండి

ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

గ్రామ సర్వేయర్ల సమస్యలపై బుధవారం విలేజ్ సర్వేయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో వసంత్ బాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలను ఇప్పటికే ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకూ బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు నిర్ణయించామన్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది 4,722 మంది భవిష్యత్తుపై సమగ్ర నివేదిక సమర్పించాలని, పే స్కేల్‌లో మార్పులు చేయాలని, సీనియార్టీ లిస్టులను పబ్లిష్ చేయాలని, గ్రేడ్ వన్ కేడర్ స్ట్రింగ్ ఫైనల్ చేయాలని, అర్హులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని, రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవ్వాలని నిర్ణయించామన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

ఉచితం అంటూ డబ్బులు వసూలు..!

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండల పరిధిలో ఈ నెల 2వ తేదీన సర్పంచి విజయలక్ష్మి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో దాదాపు 30 మంది కంటి చికిత్సలు చేశారు. వీరందరికీ కంటి అద్దాలు ఇస్తామని ఆరోజు నిర్వాహకులు తెలిపారు. చికిత్స కోసం వచ్చిన వారికి ఉచిత భోజనం, రవాణా సౌకర్యం, కళ్లజోడు ఉచితంగా ఇస్తామని చెప్పారు. అయితే ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన కర్నూలు శాంతి రామయ్య ఆసుపత్రి సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్లు చికిత్స నిమిత్తం వచ్చిన వారు చెబుతున్నారు. 24 మంది నుంచి రూ.1500 వరకు వసూలు చేసినట్లు చికిత్సలు చేయించుకున్న నాగమ్మ, మల్లికార్జున, శాఖమ్మ, మల్లక్క తదితరులు తెలిపారు. డబ్బులు వసూలు విషయంపై కర్నూలు శాంతిరామయ్య ఆసుపత్రి సిబ్బందిని వివరణ కోరగా పరీక్షలకు వెళ్లిన ప్రతి చోటా సాధారణ ఖర్చుల కింద డబ్బులు వసూలు చేస్తామని ఆసుపత్రి సిబ్బంది నాగార్జున తెలిపారు. ఉచిత పరీక్షలు అని చెప్పి ఇలా డబ్బులు తీసుకోవడంపై మాత్రం స్థానికంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్‌విపిఎస్ స్కాలర్‌షిప్‌నకు 12మంది ఎంపిక

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అర్జస్ స్టీల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్‌విపిఎస్(సండూర్ విద్యా ప్రోత్సాహ స్కాలర్‌షిప్)కు మండలానికి చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు స్టీల్ ప్లాంట్ సిబ్బంది తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు బుధవారం ఎంఇఒ నాగరాజు స్కాలర్‌షిప్ పత్రాలు అందజేశారు. స్టీల్ ప్లాంట్ సిబ్బంది మాట్లాడుతూ కర్నాటకలోని యశ్వంత్‌నగర్ సండూర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించడానికి ఈ స్కాలర్‌షిప్ తోడ్పడుతుందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ. 1.5 లక్షల చొప్పున ఖర్చు చేస్తారన్నారు. ఎస్‌విపిఎస్ స్కాలర్‌షిప్‌ను ఈ సంవత్సరం ప్రారంభించామని, రానున్న కాలంలో మరింత మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్జస్ స్టీల్ ప్లాంట్ సీఈవో పసుపులేటి ఆనంద్, సిఓఓ జయప్రకాష్ దేవరాజ్, ప్లాంట్ హెచ్‌ఆర్ రాజేష్ రంజన్ ఠాకూర్, సిఎస్ఆర్ హెడ్ మీనా నరేందర్ స్టీల్ ప్లాంట్ సిబ్బంది, ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు పత్రాలను అందిస్తున్న ఆర్జాస్ కంపెనీ ప్రతినిధులు

హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దాం

ఎపి ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దామని ఎపి ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని మాసినేని గ్రాండ్ హోటల్‌లో బుధవారం ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల నివారణలో మహిళా సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్లకు అందుతున్న సేవలు, నివారణ చర్యలపై సమీక్షించారు. హెచ్ఐవి ప్రభావిత ప్రాంతాలను గుర్తించి సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సూక్ష్మ ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఆ మేరకు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎపిఎస్ఎసిఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డా. కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ సేవల ఆధారంగా స్వచ్ఛంద సంస్థలకు గ్రేడింగ్ ఇస్తామని, ఆ మేరకు నిధులు మంజూరవుతాయన్నారు. ఎపిఎస్ఎసిఎస్ డిప్యూటీ డైరెక్టర్ డా. శ్రీనివాసవర్మ, డబ్ల్యుహెచ్ఒ కన్సల్టెంట్ సుకుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా స్వచ్ఛంద సంస్థల పనితీరును వివరించారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డా. ఈబి.దేవి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారులు డా. అనుపమ జేమ్స్, డా. భాస్కర్, డా. శారదాబాయి, అనంతపురం, కర్నూలు జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్లు వెంకటరత్నం, అలీ హైదర్, సూపర్‌వైజర్ రమణ, సిబ్బంది మురళి, నారాయణస్వామి, వైద్య, ఆరోగ్య శాఖ డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ఆయా జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రాజెక్టు డైరెక్టర్లు, ప్రాజెక్టు మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాసినేని గ్రాండ్ హోటల్‌లో సమావేశమైన అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

'ఉపాధి' బిల్లులివ్వకపోతే కుటుంబాలు గడిచేదెలా..?

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోతే కూలీలు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి ప్రశ్నించారు. ఉపాధి హామీ బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రాంత పేదలకు వరం లాంటిదన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వార్థ రాజకీయాల కోసం ఈ చట్టాన్ని పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం అవుతుందన్నారు. మండల వ్యాప్తంగా 8 వారాల నుంచి బిల్లులు చెల్లించలేదన్నారు. ఇకనైనా 14 రోజు ల్లోపు బిల్లులు చెల్లించాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, శ్రామికులకు పనిముట్లు, ప్లే స్లిప్పులు ఇవ్వాలని, మేట్లకు పారితోషికం చెల్లించాలని, జాబ్ కార్డుకు 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ. 600వేతనం ఇవ్వాలని, వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా వంద రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. చిన్నముష్టూరు, పెద్ద ముష్టూరు, మోపిడి గ్రామాల్లో రూ. 270కు మించి కూలి రావడం లేదని కూలీలు ఆవేదన చెందారు. అనంతరం ఎంపిడిఒ రవి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్య దర్శులు సురేష్, వెంకటేశులు, వ్యకాసం మండల కార్యదర్శి మురళి, వీరాంజనేయులు, రవి, సిద్ధప్ప, నాయకులు సుంకన్న, లక్ష్మన్న, ఎర్రిస్వామి, రామాంజనేయులు, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన ఎపి వ్యకాసం నాయకులు

ప్లేట్లు అందజేస్తున్న దాత

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన కె.యంగమునిరెడ్డి కుమారుడు కె.హరినాథరెడ్డి జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం బుధవారం కడవకల్లు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు 80 స్టీల్ ప్లేట్లు, 2 తాగునీటి క్యాన్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

దేవగిరి క్రాస్‌లో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని దేవగిరి క్రాస్‌లో 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, దీంతో ఈ ప్రాంతంలో మూడు, నాలుగు రోజులకు ఓ సారి కూడా నీరు సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ కుటుంబాలకు చిన్న ట్యాంకు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో సమీపం లోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి కోసం నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, అలాగే శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని కోరుతున్నారు.

టిడిపి నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న నరసింహస్వామి ఆలయంలో బుధవారం టిడిపి మండల కన్వీనర్ శివన్న ఆధ్వర్యంలో గ్రామ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులుగా పైడిపాటి శ్రీకాంత్ చౌదరి, ఉపాధ్యక్షులుగా నగేష్‌తో పాటు కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికల్లో నాయకులు కరణం రామ్మోహన్ చౌదరి, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, ఆవుల తిప్పేస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

గుత్తి : పట్టణంలోని ఎల్ఎం బాలుర ప్రాథమిక పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో 1967–72లో 1 నుంచి 5వ తరగతి వరకూ చదివిన విద్యార్థులందరూ కలిసి స్టడీ మెటీరియల్, నోట్ పుస్తకాలు, పలకలతో పాటు తదితర విద్యాసామగ్రి కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. నాలుగేళ్లుగా వీటిని అందజేస్తున్నా మని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విశ్రాంత వార్డెన్ మల్లికార్జునరావు, రాజశ్రీ, గ్రేస్ మేరీ, నాగరాజు, ఇమామొద్దీన్, ఫక్రుద్దీన్, పాఠశాల హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ చేసిన పూర్వ విద్యార్థులు

పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పట్టణ అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా పలు ప్రయివేటు పాఠశాలల్లో ఒలింపియాడ్, ఐఐటి లీడ్ పేర్లతో పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలియడంతో బుధవారం వారు మున్సిపాలిటీ పరిధిలోని కిండర్ గార్డెన్ పాఠశాలను సందర్శించారు. అలాగే అక్కడికి ఎంఇఒ బి.రవినాయక్‌ను పిలిపించి మాట్లాడారు. నిబంధనలను అతిక్రమించిన ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అధికంగా ఫీజుల వసూలు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్‌యాదవ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాస్టల్‌ను ప్రభుత్వ భవనంలోనే కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని అక్కమ్మగార్ల కొండ వద్ద ఉన్న ప్రభుత్వ సొంత భవనంలోకి మార్చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక దొడగట్ట రోడ్డులోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న ప్రభుత్వ బిసి సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని అనంతపురం రోడ్డులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహానికి మార్చాలని కోరారు. ఇప్పుడున్న హాస్టల్‌కు సరైన రోడ్డు మార్గం లేక విద్యార్థులు కళాశాలలకు రావాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో మోకాలి లోతు గుంతల్లో కళాశాలకు రావల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతే కాకుండా రాత్రి వేళ బహిర్భూమికి వెళ్లాలంటే సరైన బాత్ రూమ్స్ లేక ఆరుబయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేలాది రూపాయలు అద్దె చెల్లించి మౌలిక వసతులు లేని అద్దె భవనాల్లో ఉండడం కంటే ప్రభుత్వం నిర్మించిన నూతన భవనంలోకి హాస్టల్‌ను మార్చి అక్కడ సరైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రామ సభల్లో సమస్యలను పరిష్కరించుకోండి

ప్రజాశక్తి-అనంతపురం

జులై 1వ తేదీ నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఓటర్లందరూ పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండల పరిధిలో బుధవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో కె.అల్తాఫ్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్‌బాబు, సర్పంచి జి.ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ బంగి సుదర్శన్ పాల్గొని రహదారులపై మైక్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం ఏడాదిలో 4 విడతలుగా ప్రభుత్వమే గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజల వద్దకు పాలన అందిస్తుందన్నారు. కావున ప్రజలందరూ అవగాహన కలిగి ఉండి గ్రామసభల్లో పాల్గొని మీ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.సుబ్బరాయుడు, నాయకులు బసయ్య, సూర్యనారాయణ, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సాకే జయరామ్‌కు నివాళి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని చల్లా కాంప్లెక్స్‌లో బుధవారం వినియోగదారుల సంఘం పట్టణ గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో సాకే జయరామ్ జయంతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. సంఘం అధ్యక్షుడు చల్లా కిషోర్ మాట్లాడుతూ ఆయన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎందరో ప్రస్తుతం ఉన్నత హోదాలో ఉన్నారన్నారు. ఆయన విద్యాబోధనలు, రచనలు చిరస్మరణీయం అన్నారు. ఆయన కామర్స్ లెక్చరర్‌గా, ధర్మవరం, గుత్తి జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపల్‌గా సేవలందించారని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కొనంకి శ్రీధర్, అనంతనేని రాధాకృష్ణ, ఓబుళరాజు, మల్లిపల్లి సర్పంచి నారాయణ, రాష్ట్ర ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు మాధవ్, గోపాల్, కరణం మల్లికార్జునబాబు, లింగప్రసాద్, కొల్లాపురి, సోము, సుమిత్ర, సావిత్రి, ప్రసన్న లక్ష్మి, నారాయణ, గంగరాజు, మర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటకు మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

మామిడి పంటకు కనీస మద్దతు ధర కిలో రూ. 15 వెంటనే ప్రకటించాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు, బిసివై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌనిప్రతాప్ డిమాండ్ చేశారు. రాబోయే పంట సీజన్‌లో ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా విత్తనాలు అందించాలని కోరారు. ఎంతో కష్టపడి పంట పండించగా ధర కిలో ఒక రూపాయికి పడిపోవడంతో రైతులు నష్టాల పాలయ్యారన్నారు. మామిడి రైతులకు కనీస మద్దతు ధర రూ. 15 చెల్లించాలని బిసివై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ బుధవారం చిత్తూరు జిల్లాలో చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల సమస్యలు తమకు తెలియజేస్తే సాధ్యమైనంత త్వరగా వాటి పరిష్కారం కోసం తామెప్పుడూ ముందుంటామని తెలిపారు.

దండోరా కమిటీ అధ్యక్షులుగా తలారి చంద్ర

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఎమ్మార్పీఎస్ మండల కమిటీని నూతనంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బారావు తెలిపారు. బొమ్మనహాల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ అధ్యక్షులుగా తలారి చంద్ర, ఉపాధ్యక్షులుగా ఉమేష్, కార్యదర్శిగా స్వామి, ట్రెజరర్‌గా శివరామ్, 11 సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే దళితులకు జరిగే అన్యాయాల పట్ల ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను నిలదీయాలన్నారను. అందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హరి, గోపాల్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలకు మరమ్మతులు

నార్పల : స్థానిక ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడం తో ప్రట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు త్వరలో గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే విద్యుత్ దీపాల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం వీధి దీపాల మరమ్మతులు చేపట్టారు. అలాగే గూగూడు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐలకు సూచించారు. ప్రధానంగా నార్పల మెయిన్ బజార్‌లో ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని, వాహనదారులు అతివేగంగా వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

వీధి దీపాలను సరిచేస్తున్న సిబ్బంది

పైపులైన్ మరమ్మతులు పరిశీలన

గుత్తి : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న తాగునీటి సరఫరా, పైపులైన్ లీకేజీ మరమ్మతులను బుధవారం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పైపులైన్ లీకేజీలను అరికట్టి తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ డిఇఇ హేమచంద్ర, కార్మికులు ఉన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని తలవాలకట్ట వద్ద ఉన్న 5వ వార్డ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం టిడిపి పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ సరస్వతి విద్యా మందిరం నిట్టూరు నిలయం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అంతకుముందు చైతన్య కాలనీ, వికె.ఆదినారాయణ రెడ్డి కాలనీల ప్రజలు విద్యుత్ సమస్యలను మొరపెట్టుకోగా ఆయన వెంటనే విద్యుత్ శాఖ అధికారి మధుసూదన్‌తో మాట్లాడి 20 స్తంభాలు, విద్యుత్ తీగలు మంజూరు చేయించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు వేయాలని ప్రజలు కోరగా త్వరలోనే వేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో పంచాయతీ సెక్రటరీ అశ్వత్థమనాయుడు, విద్యుత్ శాఖ అధికారి మధుసూదన్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పీరా, సంజీవకుమార్, బొమ్మా మోహన్, కరూర్ శివశంకర్, బాబా, బాషా, మల్లయ్య, శీన, ప్రతాప్ యాదవ్, శివ, పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

అంబేద్కర్ భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనం నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఈ మేరకు బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్డీవో వసంత బాబుకు వినతి పత్రం అందజేశారు. హరి మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు ఎస్సీ నియోజకవర్గంగా కొనసాగినప్పటికీ కళ్యాణదుర్గంలో అంబేద్కర్ భవనం గురించి ఎవరూ ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. కుల, ప్రజా సంఘాల పోరాటం ఫలితంగా అంబేద్కర్ భవనానికి 95 సెంట్లు కేటాయించగా కొంత స్థలం ఆక్రమణలకు గురైందని, అధికారులు కబ్జాదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం రూ. 2 కోట్లు విడుదల కాగా నిర్లక్ష్యం కారణంగా వెనక్కి వెళ్లిపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి అంబేద్కర్ భవనం నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణాల కోసం విస్తృతస్థాయిలో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెలిమప్ప, దొనతిమ్మప్ప, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఈశ్వర ప్రసాద్, రామకృష్ణ, నారాయణస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాకే హరి

మారెక్క మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

టిడిపి కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలంలోని కామక్కపల్లి గ్రామానికి చెందిన టిడిపి మాజీ ఎంపీటీసీ చంద్ర మాతృ మూర్తి, టిడిపి సీనియర్ నాయకురాలు మారెక్క(80) బుధవారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ గ్రామం వెళ్లి మారెక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, వెంకటేషులు, రమేష్ ఉన్నారు.

విష జ్వరాలపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

యాడికి పిహెచ్‌సి పరిధిలోని కోనఉప్పలపాడు గ్రామంలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ప్రజలకు విష జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా నివారణ మాసం సందర్భంగా ముందుగా జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విష జ్వరం సోకకుండా నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని, ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఎఎన్ఎం రాజామణి, మేల్ హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్త ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తురకపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం ఆ గ్రామ టిడిపి నాయకుడు విజయ్‌భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ బి.రవినాయక్ ముఖ్యఅతిథిగా హాజరై బదిలీ అయిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం విజయభరత్‌రెడ్డి రూ. 10వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ ఆయా మృతి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని నేతాజీకాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న సరోజమ్మ బుధవారం మృతి చెందింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సిడిపిఒ అనురాధ వార ఇంటి కి వెళ్లి సరోజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ. 15వేలు అందజేశారు. అలాగే అంగన్వాడీ టీచర్ జి.నిర్మల, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు రూ. 7వేలు ఆయా కూతురికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సరోజమ్మ ఆయాగా ఉత్తమ సేవలందించిందని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

సరోజమ్మ(ఫైల్‌ఫోటో)

నేరాలు ఘోరాలు

రాచానుపల్లి వద్ద వ్యక్తి దారుణహత్య

వివాహేతర నేపథ్యమే కారణం

మృతుని భార్య, ప్రియుడు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం రాచానుపల్లి వద్ద బుధవారం ఉదయం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అనంత పురం సమీపంలోని సదాశివ కాలనీలో నివసిస్తున్న కుమ్మర నరసాపురం సురేష్ బాబు(43) హత్యకు గురయ్యాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ నిందితులను పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితులను బుధవారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. హత్యకు గల కారణాలను రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఆంజనేయులు మీడియాకు వివరించారు. అక్రమ సంబంధం నేపథ్యంలో సురేష్ బాబు భార్య ప్రియుడుని ఉసిగొల్పి హత్య చేయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మృతుని భార్య కుమ్మర నరసాపురం అనిత, ఆమె ప్రియుడు బాబా ఫకద్దీన్‌లను అరెస్టు చేశారు. అనిత, ఫకృద్దీన్‌ల మధ్య సంబంధానికి భర్త బాబు అడ్డుగా ఉన్నాడని భావించి ఎలాగైనా అతన్ని కడతేర్చాలంటూ ఇద్దరూ భావించారు. ఇందులో భాగంగా అనిత ప్రియున్ని హత్యకు ప్రేరేపించింది. ప్రతీరోజూ రాత్రి హోటల్ మూసేసి తన భర్త ద్విచక్రవాహనంపై ఇంటికొస్తారని ఆ సమయంలో అతన్ని హత్య చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తున్న సురేష్ బాబుపై ఫకృద్దీన్ దాడి చేశాడు. ముందుగా ఖాళీ సీసాను సురేష్‌బాబుపై విసిరాడు. ద్విచక్రవాహనం నుంచి కిందపడిన అతన్ని స్క్రూడ్రైవర్‌తో పొడిచి ఆతర్వాత బండరాయితో బాది చంపాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. హత్యోదంతంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు అన్ని కోణాల్లో విచారించి రాబడిని సమాచారం మేరకు ఘటన జరిగిన ఆరుగంటల్లోపు ఛేదించి నిందితులు ఇద్దరినీ అరెస్టు చేవారు. కేసును ఛేదించిన సిఐ శేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఆంజనేయులు

రైల్వేస్టేషన్‌లో కుప్పకూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే స్టేషన్‌లో బుధవారం ఓ వ్యక్తి ఉన్న ఫలంగా కుప్పకూలి మృతి చెందాడు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాలు.. పామిడి మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(55) తన బంధువుతో కలిసి తిరుపతి వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి గుత్తిలో దిగాడు. అర్ధరాత్రి కావడంతో రైల్వేస్టేషన్లోనే నిద్రించాడు. బుధవారం ఉదయం లేచి రైల్వేస్టేషన్ బయటకు వెళ్లడానికి మెట్లు ఎక్కుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి కింద పడ్డాడు. దీంతో అతడిని రైల్వే పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ఈ ఘటనపై జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాహనం ఢీకొని యాచకునికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద బుధవారం వాహనం ఢీకొని ఓ యాచకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిత్తూరు నగరానికి చెందిన గోపాల్ కొంతకాలంగా గుత్తిలో ఉంటూ యాచిస్తూ కడుపు నింపుకునేవాడు. ఈ క్రమంలో టమాటా మార్కెట్ వద్ద కూర్చొని ఉండగా టమోటా లోడుతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైసిపి నాయకుల మృతికి సంతాపం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు మంజునాథ్(47) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పేస్వామి ఆ గ్రామం వెళ్లి మంజునాథ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీకి ఎన్నో సేవలు అందించి నిరంతరం పార్టీ అభివృద్ధికి పాటుపడిన మంజునాథ్ మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన వెంట వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరప్ప, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కళ్యాణదుర్గం కన్వీనర్ గోళ్ల సూర్యనారాయణ, సర్పంచి శెట్టిగారు మంజునాథ్, పొబ్బర్లపల్లి సర్పంచి మమతగంగాధర్, వైస్ సర్పంచి సన్న నీలప్ప, ఎంపీటీసీ బుషప్ప, లోకేష్, నాగేంద్రప్ప, మహాదేవప్ప, నాగరాజురెడ్డి, శరణప్ప ఉన్నారు.

ఖాజా హుస్సేన్‌కు నివాళి

యాడికి : మండలంలోని కూర్మాజీపేట గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు లారీ ఓనర్ ఖాజాహుస్సేన్ అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఆ పార్టీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, రాయలచెరువు నాయకుడు తలారి నాగేష్, ఉపసర్పంచి ప్రవీణ్ ఆ గ్రామాం వెళ్లి ఖాజాహుస్సేన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వర నాయుడు

గుండెపోటుతో వైసిపి కార్యకర్త మృతి

పామిడి : మండలంలోని తంబళ్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ఖాదర్‌బాషా మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో బుధవారం వైసిపి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి, సొరకాయల పేట సర్పంచి నాగేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాయకులు ఆ గ్రామం వెళ్లి ఖాదర్‌బాషా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు బుధవారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మాదినేని ఉమామహేశ్వరనాయుడు, సర్పంచి బాబు, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, చంద్రశేఖర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి ఆంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట నాయకులు నారాయణ, సత్తి, కొల్లప్ప, నరసింహులు, బొమ్మయ్య ఉన్నారు.